కథ

# ఈనాటి ఈ బంధమేనాటిదో...?

సూర్యుడు తప్పకుండా ఉదయిస్తాడు.

అదీ తూర్పునే ఉదయిస్తాడు.

కానీ చంద్రుడు అప్పుడప్పుడూ రాడు.

అదేమంటే 'అమావాస్య' అంటాడు.

నా పరిస్థితీ అంతే! అన్ని పనులు ఠంచనుగా చేసుకోవడానికి అలవాటు పడ్డ వాణ్ణి. కానీ వయసు ప్రభావం వల్ల అనారోగ్యాలు అప్పుడప్పుడూ అమావాస్యల్లా వచ్చిపోతూనే వుంటాయి.

ఉదయం ఐదున్నరకు అలారం మోగడంతో నా దినచర్య ప్రారంభమవుతుంది.

అలవాటు ప్రకారం లేవగానే దుప్పటి మడిచి బాత్‌రూంలో దూరి, కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ తయారు చేసుకుని, నాకిష్టమైన కప్పులో పోసుకుని, బాల్కనీలోకి వచ్చి కూర్చున్నాను.

అప్పటికే గడియారంలోని చిన్నముల్లు ఐదు మీదా, పెద్దముల్లు పన్నెండు మీదా వున్నాయి.

'అంటే ఇంకో గంట వరకూ నాకు బోర్ కాలక్షేపం. తర్వాతెలాగూ పేపరొస్తుందిగా!' అనుకుంటూ కాఫీ సిప్‌చేసి, తలెత్తి ఎదురింటి వైపు చూశాను.

'మా అన్నయ్యకి ఇక్కడేం పని? పైగా ఇంత ఉదయాన్నే అతన్తో మాట్లాడుతున్నాడేమిటి' అనుకుంటూ ఆ ఇంటిని ఎగాదిగా చూశాను.

ఎప్పుడూ తెల్లారేసరికల్లా వాకిట్లో ముగ్గులు కనిపించేవి.

కానీ ఇవాళేంటి? ముగ్గులు కాదు కదా! కనీసం ఊడ్చిన గుర్తులు కూడా లేవు.

ఇంటి ముందున్న వేపచెట్టు రాత్రంతా రాల్చిన వేపాకులు ఎక్కడివక్కడే వున్నాయి.

పిల్లల సందడి లేదు, పెద్దల హడావిడీ లేదు, పూజా పునస్కారాలు అంతకన్నా లేవు.

'సంగతి ఏమై వుంటుందబ్బా..' అని నేను అనుకుంటూ వుండగానే వ్యానొకటి వచ్చి ఇంటి ముందు ఆగింది. నా ఆలోచనల్ని తాత్కాలికంగా ఆపేసి, అటువైపు చూశాను.

ఆ ఇంటి కోడలు గబగబా వచ్చి తన చేతులో వున్న దుప్పటిని వ్యాన్లో పరిచింది. ఈలోగా అబ్బాయిలిద్దరూ తమ తల్లిని చెరోవైపు పట్టుకుని, కాదుకాదు ఎత్తుకుని వ్యాన్ దగ్గరికి తీసుకువస్తున్నారు. 'బహుశా హాస్పిటల్‌కి కాబోలు'

అమ్మాయి ఇంట్లోకి వెళ్ళి తన మరదలితో ఏదో చెబుతూ భుజం మీద చెయ్యి వేసింది.

బహుశా దానిని అనురాగం అంటారో లేక ఇంకేదైనా అంటారేమో!

నేనేమో ఒంటరి పక్షిని. అందుకే నాకిలాంటి వన్నీ అంతబాగా తెలీవు.

ఆ అబ్బాయిలిద్దరూ తమ తల్లిని వ్యాన్లో పడుకోబెట్టాక, చిన్నబ్బాయి వ్యానెక్కి కూర్చున్నాడు.

ఈలోగా ఆ ఇంటి కోడలు వచ్చి మరిదితో బాటు తను కూడా వ్యానెక్కింది.

పెద్దవాడు ముందుగా తన బైక్ మీద కదిలాడు. అతని వెనకే వ్యాన్ బయల్దేరింది.

ఆడపడుచూ, పిల్లలూ గేటు దగ్గరే నిలబడ్డారు.

మా అన్నయ్య కూడా అక్కడే నిలబడ్డాడు.

వ్యాన్ కనుమరుగయ్యాక ఆ అమ్మాయి వైపు తిరిగి ఏదో చెబుతున్నాడు.

ఆమె తల వంచుకుని వింటూ వుంది.

మధ్య మధ్యలో తలను అడ్డంగా, నిలువుగా ఊపుతుంది.

ఓ రెండు నిమిషాల తరువాత మా అన్నయ్య అక్కడి నుంచి కదిలాడు.

ఆ అమ్మాయి కూడా పిల్లల్ని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అంతవరకూ తిలకిస్తూ నించున్న నేను వెనక్కి తిరిగి వచ్చి కుర్చీలో కూర్చున్నాను.

కాఫీ గోరువెచ్చగా వుంది.

వేడి చేసుకునే ఓపిక లేక మెల్లగా అలాగే తాగాను.

తాగడం అయిన తరువాత కప్పు టీపాయ్ మీదపెట్టి, పంచె అంచుతో పెదాలు అద్దుకుని, మడత కుర్చీలో వెనక్కివాలి, విశ్రాంతిగా కూర్చుని కాళ్ళు టీపాయ్ మీదపెట్టి, కళ్ళజోడు తీసి కిటికీలో పెట్టి, ఓ చెయ్యి పొట్టమీద, మరో చెయ్యి తల మీద పెట్టుకున్నాను.

కళ్ళు మూసుకుని తీరిగ్గా ఆలోచించడం మొదలుపెట్టాను.

ఆనందరావుగారి చరిత్ర నా కళ్ళ ముందు సినిమా రీలులా కదిలిపోసాగింది.

★★★

పల్లెలో నా బాధ్యతలన్నీ తీరాక, ఏ బాదరబందీ లేని నేను పట్నం వచ్చాను.

హైదరాబాద్‌లో దూరపు చుట్టం అయిన ఓ అన్నయ్య వున్నాడు.

అతని దగ్గరే వుంటూ తను అనుమతిస్తే వాళ్ళింటి పైనే నేనూ ఓ ఇల్లు కట్టుకుంటానని చెప్పాను. అన్నయ్య ఒప్పుకోవడమే ఆలస్యం, ఇల్లు కట్టించేశాను.

పెళ్ళి ఎలాగూ చేసుకోలేదు. చేసుకోవాలన్న ఆశలేదు.

ఊళ్ళో వున్న ఆస్తులను అమ్మేసి, వాటాలు పంచగా, నాకు వచ్చిన వాటాతోనే ఇల్లు కట్టగా, మిగిలిన డబ్బుని బ్యాంకులో వేసుకుని, వచ్చే వడ్డీతో హాయిగా బ్రతుకుతున్నాను.

మా అన్నయ్య వాళ్ళింటికి ఎదురుగుండానే ఆనందరావుగారిల్లు. పేరుకి తగ్గట్టుగానే... తిన్నా, తినకపోయినా, ఎన్ని ఇబ్బందులున్నా మనిషి ముఖం మీద నవ్వు చెరిగేది కాదుట.

చెప్పుకోదగ్గ ఉద్యోగం, ఆస్తిపాస్తులు ఏమీ లేకపోయినా, తన కష్టార్జితంతో పెద్ద ఇల్లు కట్టాడు.

ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు.

అతను పోయే నాటికల్లా పెద్దబ్బాయి చేత ఓ చిన్న వ్యాపారం పెట్టించి, పెళ్ళి కూడా చేసిపోయాడని మా అన్నయ్య ఎప్పుడో నాతో చెప్పినట్లు గుర్తు.

పాపం చాలా మంచి మనిషని అందరూ అంటుంటారు.

ఆ వచ్చిన కోడలు కూడా ఆ ఇంటికి తగిన అమ్మాయే!

మహా నెమ్మదస్తురాలు.

ఇప్పుడా జంటకి ముగ్గురు పిల్లలు కూడా!

ఆనందరావుగారి పెద్దబ్బాయి పరమభక్తుడు. ఎండా కాలమైనా, వానా కాలమైనా, చలి కాలమైనా ఇంకే కాలమైనా సరే! తెల్లారేసరికల్లా తలారా స్నానంచేసి, తడిగుడ్డ నడుముకి చుట్టి, ఇంట్లోకీ బయటికీ హడావిడిగా తిరుగుతూ, శ్లోకాలు చదువుతూ వుంటాడు. వాళ్ళావిడ కూడా స్నానం ముగించి, తలకి తుండుగుడ్డ చుట్టి,

భర్తతో సమానంగా పోటీపడుతూ హడావిడిగా వంటింట్లో ఘుమఘుమలు తయారుచేస్తూ వుంటుంది.

ఆ ఘుమఘుమలు మా ఇంటి దాకా వస్తాయి మరి.

మేమేం తక్కువ తిన్లేదన్నట్టుగా పిల్లలు కూడా తెగ హడావిడి పడిపోతూ..

''మమ్మీ నా టై ఏదీ?'' అని ఒకరంటే..''మమ్మీ నా సాక్సులు కనిపించడం లేదు.'' అని మరో అబ్బాయి అరుపు, ''మమ్మీ జడవెయ్యి'' అంటూ చిన్నపిల్ల పొలికేక. వాకిట్లో ముగ్గులేసి, పిల్లలకి కావలసినవి అందిస్తూ...సహాయం చేస్తుంది ఆనందరావుగారి చిన్నకూతురు.

తరువాత ఆ అమ్మాయి కూడా తయారయిపోయి బహుశా కాలేజీకేమో వెళ్ళిపోతుంది.

ఇహపోతే ఆనందరావుగారి చిన్నబ్బాయి.

భలే మనిషి. తీరిగ్గా ఏ పది గంటలకో లేచి, జలకాలాడి బయటపడితే... తిరిగి ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఇల్లు చేరతాడు.

ఎన్నిసార్లు అతని బైక్ చప్పుడుకి మధ్యరాత్రులు మెలకువ రాలేదు తనకి?

దాదాపు ముప్పయ్యేళ్ళుంటాయేమో!

ఇంకా పెళ్ళి చేసుకోలేదు. కరెక్టుగా చెప్పాలంటే అన్నకంటే తమ్ముడే ఆర్థికంగా బాగా వున్నవాడు.

అతనిది గవర్నమెంట్ ఉద్యోగమని అనుకుంటుంటే విన్నాడు తను.

అయినా తనకి తెలిసి ఆ ఇంట్లో ఎప్పుడూ ఎలాంటి గొడవలు జరగలేదు.

ఈమధ్య వాళ్ళ పెద్ద చెల్లి పెళ్ళి కూడా చేశారు.

ఇకపోతే ఆనందరావుగారి భార్య విషయానికొస్తే-

కోడలొచ్చి దాదాపు పదిహేను, పదహారు సంవత్సరాలు గడుస్తున్నా ఆవిడ తన కోడలితో గొడవ పడగా ఏనాడు ఎవ్వరూ చూళ్ళేదు

కారణం, వాళ్ళసలు గొడవ పడరు.

బహుశా వారికి గొడవంటే ఏమిటో తెలీదనుకుంటా!

తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ ఆ ఇంట్లో మాటల హోరతులూ, నవ్వుల గంటలే వినిపిస్తాయి.

ఆవిడకు కొంతకాలంగా ఆరోగ్యం బాగాలేదనుకుంటా!

ఏమయ్యిందో తెలీదు. అప్పుడప్పుడూ తీస్కెళ్ళి హాస్పిటల్లో వుంచుతుంటారు.

పాపం, పెద్దావిడ కదా! అందుకే అనారోగ్యాలు తప్పలేదు కాబోలు.

కాని, ఆవిడ చాలా అదృష్టవంతురాలు.



కొడుకు, కోడలు, ఆ ఇంట్లో వాళ్ళందరూ ఆవిడ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

ఈరోజుల్లో ఎంతమంది వున్నారు అలాంటివాళ్ళు?

తమ పెళ్ళిళ్ళు కాగానే తల్లిదండ్రుల్ని తన్ని తరిమేస్తున్నారు.

కనుక ఇలాంటి కొడుకులుంటే గొప్పేమరి.


ఇంకా ఎక్కువగా చెప్పాలంటే ఆ ఇంటి కోడలే!

అలాంటి కోడళ్ళు ఎంతమంది వుంటారు ఈ రోజుల్లో?

నేను పట్నం వచ్చి పదేళ్ళయినా మా కాలనీలో దాదాపు ఎవరూ నాకు పరిచయం లేరు. ఉన్నా ముఖపరిచయం వున్నవాళ్ళు తప్ప పన్నెత్తి మాట్లాడేవాళ్ళు లేరనే చెప్పాలి. ఎందుకంటే నేనెక్కడికీ వెళ్ళను. వెళ్ళాల్సిన అవసరం నాకు రాదు. అవసరమైన సరుకులూ, కూరగాయలు లిస్టురాసి మా పనిమనిషికిస్తే ఆవిడే వస్తూ వస్తూ తెస్తుంది.

ఏ వారం పదిరోజులకోగాని గడప దాటను. దాటినా, ఓ అరగంట ఈవినింగ్ వాకింగ్ చేసి వచ్చేస్తాను. ఇప్పుడే కాదు, నేను చిన్నప్పటి నుంచీ అంతే!

ఎవరితోనూ కలవను, మాట్లాడను.



పనివాళ్ళతో కూడా అంత అవసరమైతేనేగాని మాట్లాడను.

అంతదాకా ఎందుకు? మా అన్నావదినల్తోను, వారి పిల్లలతో కూడా ఎప్పుడో ఓసారి తప్ప పెద్దగా మాట్లాడను. నా స్వభావం తెలిసి వాళ్ళు కూడా నన్ను కదపరు.

★★★

నా ఆలోచనల్లోనే కాసేపటికి 'పేపర్' అన్న పేపర్ వాడి అరుపూ, వెనువెంటనే పేపర్ వచ్చి ఇంట్లో పడిన చప్పుడూ వినిపించాయి.

అయినా లేవాలనిపించలేదు. మనసేం బాగోలేదు.

''ఛఛ ఇలాంటివన్నీ మామూలే'' అనుకుంటూ లేచివెళ్ళి పేపరందుకుని కాసేపు తిరగేశాను.

వార్తలేవీ బుర్రకెక్కడం లేదు.

పేపరు టీపాయ్ మీద పడేసి లోపలికెళ్ళాను. పనిమనిషి వచ్చినట్లుంది.

బాత్రూంలోకెళ్ళి తీరిగ్గా తలారా స్నానం చేశాను. స్నానం అయ్యాక వంట చేద్దామని కిచెన్లోకి నడిచాను. నాకు అదో హాబీ!

ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు తప్పనిసరి అవసరం.

ఎవరైనా చేస్తే నచ్చదు.

అందుకే కాస్త ఇబ్బందనిపించినా నేనే చెయ్యి కాల్చుకుంటాను..

మల్లెపూల ఉదయసుధ

పైగా ఈరోజు ఆనందరావుగారి పకాలు తేనెటీగల్లా కందిరీగల్లా ముసురుకుంటు యి.

ఆలోచనలతోనే వంట కానిచ్చాను.

ఆలోచించీ.. చించీ.. బుర్ర తెగ డెక్కిన ట్టుంది.

ఇహ ఆలోచించడానికి వీల్లేకుండ బుర్ర అయోమయం అయిపోయింది.

సరేననుకుని ఆనందరావుగారిని అ కటితో వదిలేసి కాసేపు రిలాక్సయి, భోజనం గించి, ఓ కునుకు తీసి లేచేసరికి సాయంత్రమం ంది.

కాస్త ఫ్రెష్ అయ్యి, ఎప్పటిలాగా చేతి కాఫీ కప్పుతో బాల్కనీలో బైఠాయించాను.

ఎదురింట్లో ఎలాంటి సందడీ లేదు.

'బహుశా అందరూ హాస్పిటల్‌కి వెళ రేమో! పైగా ఇంటికి తాళం కప్ప కూడా వేలాడ ంది. అంటే ఆడపడుచూ, పిల్లలు కూడా వె రన్న మాట. కొంపదీసి ఆనందరావుగారి భా పోలే దుకదా!' అనుకున్నాను నాలో నేను.

'నీకేం పోయేకాలం? ఆవిడ చావుని క కుం టున్నావ్..' అంటూ నా అంతరాత్మ నన్ను నాలుగు దులిపింది.

'ఆవిడ చావాలి' అనలేదుగా! పోయి వేమో నని నా అనుమానం వెలిబుచ్చాను. ంతే! అంటూ నా అంతరాత్మకి సర్దిచెప్పాను. ందు కంటే నేనలా అనుకోవడంలో తప్పేమీ లేదు కాబట్టి. అసలలా అనుకోవడం మా నైజం కనుక నన్ను తప్పులో ఇరికించుకుని న అంత రాత్మ ముందు తలొంచుకోవటం నాకిష్టం లేదు.

ఆలోచనలతోనే కాఫీ త్రాగడం పూర్తం ంది. మనసాగడం లేదు.

ఆవిడకెలా వుందో ఏమిటో? కిందికె అన్న య్యాని కనుక్కుంటే పోలా!

'అయినా వాళ్ళ గురించి నాకేమిటో అంత ఇంట్రెస్టు' అనుకుంటూ కుర్చీలోంచి లే వాణ్ణే మళ్ళీ అక్కడే కూలబడ్డాను.

ఉదయం టీపాయ్ మీద పెట్టిన పేప కని పించింది.

ఆల్రెడీ ఓసారి చదివినా, ఏమీ తోచక మళ్ళీ దాన్నే పట్టుకుని ఓ గంట పరపరా నమిలేశాను దీక్షగా!

కాస్త రిలీఫ్ అనిపించింది.

ఎదురింటి వైపు చూశాను. ఊహు..మనుషులున్న జాడలేదు.

సరేలే, ఎదుటి వాళ్ళకి ఏదైనా జరిగితే మనకు భలే ఆసక్తి.

పోనీ సహాయం చేసే వాళ్ళకి అలాంటి ఆసక్తివుంటే మంచిదే!

కానీ నాలాంటి వాళ్ళకి వుండి ఏం లాభం? అనుకుంటూ లేచి లోపలికి నడిచాను. కాసేపు టీవీ చూసుకుని, భోజనం ముగించి నిద్రపోయాను.

★★★

మరునాడు ఉదయం లేవగానే ముందుగా నేను చేసిన పని బాల్కనీలోకి వెళ్ళడం. ఎదురింట్లో కనిపించిన దృశ్యం చూసి స్థాణువైపోయాను. ఏడ్పులు వినిపిస్తున్నాయి.

'అంటే... శ్రీమతి ఆనందరావుగారు పోయారా?' నా మనసు అప్రయత్నంగా బాధప డింది.

నా అంతరాత్మ 'అయ్యోపాపం' అంది. దానికి వంతపాడుతూ నా పెదాలు కూడా 'అయ్యో పాపం' అన్నాయి.

ఇక ఎక్కువసేపు అక్కడ నిలబడలేక లోపలి కెళ్ళి నా పనుల్లో పడ్డాను.

ఎవరేమయిపోయినా మన పని మనదే!

మనం తల్చుకుంటే ఆపవచ్చు. పాటి మనిషిగా వెళ్ళనూవచ్చు.

కానీ... కానీ రొటీన్ బతుకులో నేను నిస్తే జంగా తయారయ్యాను.

ఎవరెవరో వస్తున్నారు, ఏడుస్తున్నారు. పోయే వాళ్ళు పోతున్నారు. కూర్చునేవాళ్ళు కూర్చుంటు న్నారు. రాగాలు, శోకాలు...కొన్ని కనిపిస్తు న్నాయి, మరికొన్ని వినిపిస్తున్నాయి. నేను మాత్రం ఎప్పటిలాగానే స్నానం, వంట పూర్తిచే శాను. కానీ భోజనం చెయ్యలేకపోయాను. అలా గని పూర్తిగా చేయకుండా వుండనూ లేదు. కొద్దిగా ఎంగిలి పడ్డాను. ''ఫరవాలేదే! నాక్కూడా మనసు స్పందిస్తున్నట్టుగా వుందే! వయసు పెరి గిన కారణంగానా? లేక నేను పెరిగిన పరిస్థితుల ప్రభావమా? బహుశా పెరిగిన వయసే కారణం కావొచ్చు. అయినా కారణం ఏదయితేనేం? నేను స్పందిస్తున్నాను. కరడుగట్టిన, రాయిలాంటి నా హృదయం కొద్దిగా కదిలినట్లుంది. ఒక విధంగా నేనూ చివరిదశలో వున్నవాణ్ణేగా! అందుకే ఈ కద లికేమో! ఆవిడకయినా అందరూ వున్నారు. ఒక్క భర్త తప్ప. కానీ నాకెవ్వరూ లేరే? నేను చచ్చి పోతే ఎవరూ రారా? రారు, ఎందుకొస్తారు? నేనిలా మడి కట్టుకుని కూర్చుంటే కాకి కూడా రాదు. ఉండాలి, నాకూ నావాళ్ళంటూ వుండాలి. ఎందుకంటే నేను పోయినప్పుడు నా మనసు వుండదుగా అయ్యోపాపం అనడానికి. అది కూడా నాతోబాటే పోతుంది. నేను పోతే అయ్యో పాపం అనే వాళ్ళుండాలి. కన్నీళ్ళతో సాగనంపేవా ళ్ళుండాలి. నన్ను ప్రేమించేవాళ్ళయితేనే నాకోసం కన్నీళ్ళు కారుస్తారు. నన్ను ప్రేమించేవాళ్ళు నాక్కా వాలంటే ముందుగా నేను ప్రేమించాలి.

పడుకుంటే కునుకు కూడా రావడం లేదు. ఏవేవో ఆలోచనలు ఎక్కడిదాకో సాగిపోతు న్నాయి.

మనసు కూడా బరువెక్కింది.

★★★

చాలారోజుల వరకు కూడా ఆ ఇంట్లో ఎలాంటి సందళ్ళూ వినలేదు నేను. ఇకముందు కూడా వింటానో లేదోనని అనుమానంగా వుంది.

ఆ ఇంట్లోని వాళ్ళు మామూలుగానే వుంటున్నా, పూజలు, నవ్వులు వినిపించక నాలోని 'మనిషి' అశాంతితో నిద్రలేవాడు.

ఒకరోజు కావాలనే ఆనందరావుగారి చిన్న బ్బాయి వెళ్ళే దార్లో నిలబడ్డాను.

ఎందుకో ఈమధ్య ఆ అబ్బాయంటే నాక్కాస్త అభిమానం పెరిగింది.

అతను తన తల్లితో ఎలాంటి చనువుతో వుండేవాడో కళ్ళారా చూసినవాణ్ణిమరి.

ఆవిడ చేత్తో గోరుముద్దలు తినడం, ఒళ్ళో పడుకోవడం, చిన్నబాబులా అల్లరి, చెల్లితో పంతాలు, వాళ్ళమ్మ తగువులు తీర్చడం...

పాపం, ఒక్కసారిగా తల్లి మాయమయ్యేసరికి ఎలా తట్టుకోగలుగుతున్నాడో?

పైగా ఓదార్చడానికి ఓ ఆడతోడు కూడా లేదాయె.

ఆడవాళ్ళయితే భోరున ఏడ్చేసి తమ గుండె ల్లోని బాధని వెంటనే తీర్చుకోగలరు.

మగాళ్ళకా అదృష్టం లేదుగా!


ఎలాగైనా ఆ అబ్బాయిని ఈరోజు కలిసి పలకరించాలనుకు న్నాను.

కాస్త పరిచయం పెరిగితే నాలుగు ఓదార్పు మాటలు చెప్పవచ్చు.

నేనాశించినట్లుగానే అతను బయ లుదేరి, సందు మలుపు తిరిగి నావైపే వస్తున్నాడు.

సందు చిన్నగా వున్నందుకేమో! బైక్‌ని మెల్లగా నడుపుతున్నాడు.

కాస్త దగ్గరకు రాగానే కళ్ళజోడు తీసి చేత్తో పట్టుకుంటూ పలకరిం పుగా నవ్వాను.



కించిత్ ఆశ్చర్యాన్ని కళ్ళల్లో చూపిం(చి) బండిని కాస్త స్లో చేశాడు.

''బాగున్నారా'' నాలోని 'ఈగో'ని పక్క(న) నెట్టి నేనే ముందుగా మాట్లాడాను.

అసలెలా మొదలుపెట్టాలో తెలియడం లే(దు).

''బాగున్నాను సార్'' అంటూ ఆ అబ్బా(యి) బైక్‌ని ఆఫ్ చేశాడు.

అతడు సమాధానమిస్తాడని నేనూహి(ంచ)లేదు. ఏదో తలూపుతాడని అనుకున్నాను. నా అంచనా తప్పని నాకు తెలిసిపోయింది.

''ఆఫీసుకు వెళ్తున్నారా''

''ఔను సార్''

ముక్తసరిగా సమాధానం చెబుతున్నా (అత)ని మాటల్లో ఎక్కడా నిరాశన్నది కనిపించడం (లేదు).

''నేనుండేది మీ ఎదురింట్లోనే బాబూ'' అంటూ ఇంకా ఏదో చెప్పబోయేసరికి-

''అవునండీ తెలుసు'' అన్నాడు.

అంటే అతని మాటల్లో అంతరార్థమేమి(టి)? తెలుసులేరా ముసలాడా, ఎప్పుడూ మాట్లా(డ)ని వెధవ్వి ఇప్పుడెందుకు మాట్లాడుతున్నా(వ్)? అనా?

''నేను ఒక్కణ్ణే వుంటాను. మీకు వీల(ై)తే అప్పుడప్పుడూ వచ్చిపోతూ వుండండి'' (అ)న్నాను.

''అలాగే సార్, తప్పకుండా వస్తూ వుంటాను సర్. సీయూ'' అంటూ బండి (స్టా)ర్ట్ చేశాడు.

అతను వెళ్ళిన వైపే చూస్తూ..'ఏమేం (అను)కున్నాడో ఏమిటో మనసుల్లో! ఎదుటివ్య(క్తి) మనసులోకి తొంగిచూసే అవకాశముంటే (ఎం)త బాగుణ్ణు' అనుకుంటూ ఇంటిదారి పట్టాను.

నేనూహించని విధంగా అదేరోజు రాత్రి (తొమ్మి)మిది గంటలకు మా ఇంటికి వచ్చాడు.

అప్పుడే స్నానం చేశాడేమో ఫ్రెష్‌గా వున్నా(డు).

ఈ టైంలో వస్తాడని నేనూహించ(లేదు). మొదట కాస్త ఆశ్చర్యపోయినా, వెంటనే తేరు(కు)ని ఎదురువెళ్ళి సాదరంగా ఆహ్వానించాను.

ఇద్దరూ వచ్చి బాల్కనీలో కూర్చున్నాం.

ఏవేవో మాట్లాడుకున్నాం. మా మధ్య టైమూ, మాటలూ బాగానే దొర్లిపోతున్నాయి.

అతను మంచి మాటకారిలా వున్నాడు. మొదట నా ఆరోగ్యం గురించి ఆరా తీశాడు.

తరువాత మా మాటలు ఎక్కడికో వెళ్ళిపోయాయి.

చంద్రబాబు పాలన నుంచీ చంద్రమండలం దాకా! గడియారం పదిగంటలు కొట్టేవరకూ మాటల్లోనే బిజీగా వున్నాం. తరువాత ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోయాక తెలిసింది నాకు. ఇంత కాలమూ నేనేం కోల్పోయానో?

బాధపడి ప్రయోజనం లేదు. తప్పును సరిదిద్దుకోవడమే సరియైన మార్గం అనుకున్నాను.

మాటల మధ్య తెలిసింది. అతని పేరు ఆకాశ్. పేరుకు తగ్గట్టుగానే ఆకాశమంత విశాల హృదయం గలవాడు. అందర్నీ కలుపుకుపోయే మనస్తత్వం.

చాలామంచి కుర్రవాడు. అతి త్వరలోనే మేమిద్దరం చాలా క్లోజయిపోయాం.

ఒక్కొక్కరోజు ఆ అబ్బాయి రాకపోతే ఆ రాత్రి నాకు భారంగా గడిచేది.

ఓరోజు మాటల మధ్యన చెప్పాడు ఆకాశ్, వాళ్ళమ్మంటే తనకెంతో ఇష్టమనీ, అమ్మ హాస్పిటల్లో వుండగా వాళ్ళ వదిన ఎన్ని సేవలు చేసిందీ, పోయిన వాళ్ళమ్మను తిరిగి తన వదినలో చూసుకుంటున్నాడనీ, అందుకే తనూ, చెల్లీ త్వరగా కోలుకున్నారనీ, అమ్మ లేనిలోటు ఇంట్లో వదిన వల్ల తీరుతుందనీ... ఇంకా ఏవేవో విషయాలు వాళ్ళ ఒదిన గురించే సంతోషంగా చెబుతుంటే... నేను కళ్ళు ఒక్కటే కాదు, నోరూ, చెవులూ కూడా తెరుచుకుని విన్నాను. ఎంత ఆనందకరం కదా! అందుకే అతను చెబుతుంటే నా హృదయం ఆనందంతో బరువెక్కింది. నిజంగా ప్రేమానురాగాలు ఎంత గొప్పవి. వాటిని వర్ణించడానికి మహా మహా కవులకే సాధ్యం కాదు. అలాంటిది నేనెలా వర్ణించగలను?

నేను మెల్లగా మారసాగాను.

నాకంటూ భార్యాపిల్లలూ, కొడుకులూ కోడళ్ళు, కూతుళ్ళు... ఎవ్వరూ లేకున్నా చుట్టుప్రక్కల వారందర్నీ నా వాళ్ళుగా కలుపుకుంటూ మెసలసాగాను.

నాలో మార్పును చూసి మా అన్నావదినా మొదట ఆశ్చర్యపోయినా, తరువాత సంతోషించారు. ఒక్క అన్నావదినే కాదు. వీధిలో వాళ్ళందరూ సంతోషంగానే నా స్నేహాన్ని రిసీవ్ చేసుకున్నట్టు నాకనిపించింది. మా అన్న పిల్లలే కాకుండా వీధిలోని పిల్లలు కూడా నా ఇంటికి వచ్చి బాబాయ్, అంకుల్, తాతయ్యా అంటూ వరుసలు కలుపుతుంటే నాకు చాలా సంతోషంగా వుంది.

''తాతయ్యా అమ్మ పంపించింది ఈ స్వీటు తీసుకోండి'' అంటూ ఓ మనవరాలు వస్తే..

''అంకుల్, ఈ హాటు మీకిమ్మన్నారు మమ్మీ డాడీ'' అంటూ మరో అబ్బాయి.

''బాబాయ్‌గారూ, ఇవాళ భోజనానికి ఇంటికి రమ్మని నా తరఫున, మీ అల్లుడి తరఫున పిలవడానికి వచ్చాను. మర్చిపోరుకదా! మీకోసం పిల్లల్తో సహా అందరమూ ఎదురుచూస్తూ వుంటాం'' అనే ఓ కూతురు.

''సార్. ఈరోజు మీకెప్పుడు వీలయితే అప్పుడు భోజనానికి మా ఇంటికి రండి'' అంటూ ఆప్యాయంగా నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని పిలిచే ఆకాశ్.

ఇహ నాకారోగ్యం బాగోలేకపోతే చెప్పాల్సిన పనిలేదు.

వచ్చి మందులు వేసేవారొకరైతే, పూటకో ఇంటివారు క్యారేజీ పంపిస్తారు.

మరికొందరు హాస్పిటల్ దాకా తోడొస్తామనే వారు, రాత్రిపూట తోడుగా పడుకుంటాననే ఆకాశ్. వీళ్ళంతా నాకు వుండనే వున్నారు. ఇంతకన్నా ఏం కావాలి ప్రేమంటే ఏమిటో చూపడానికి?

ఇప్పుడు నాకు తృప్తిగా వుంది. ఎందుకంటే కాలనీలోని వాళ్ళందరూ నావాళ్ళే! రోజూ ఉదయాన్నే కాఫీ సేవనం కార్యక్రమం అయిపోగానే, చేతికర్ర తీసుకుని వాకింగ్‌కి బయలుదేరుతాను. దారిపొడవునా పలకరింపులే!.

''నమస్కారమండీ బాబాయిగారూ!''

''గుడ్మార్నింగ్ అంకుల్''

''బాగున్నారా తాతయ్యా''

''నమస్తేసార్'' ఈ పలకరింపులతో ఓ గంట ఈజీగా గడిచిపోతే... సాయంత్రం పూట ఇంటి పక్కనే వున్న ప్లేగ్రౌండ్‌లో చిన్నాపెద్దా మనవళ్ళతో కాలక్షేపం.

ఇప్పుడు నేను ఒంటరి పక్షిని కాదు, అలాగనీ జంటపక్షినీ కాదు. 'బంధాలూ', 'అనుబంధాలూ' వున్న పక్షిని. అందుకే నేనిప్పుడు హ్యాపీ!

